సాక్షి
ములుగు
బుధవారం । 10 । జనవరి । 2024



'కాళేశ్వరం'పై
విజిలెన్స్ దాడుల కలకలం..
- 8లో▸
కాళేశ్వరంలో ప్రాజెక్టుపై విజిలెన్స్ దాడులు కలకలం సృష్టిస్తున్నాయి. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు దాడులు చేస్తున్నారు.



రివ్యూలకు డబ్బులంటూ..
గూగుల్ రివ్యూలకు డబ్బులు ఇస్తామని ఆశ చూపి ఓ యువకుడి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.70 వేలు కాజేశారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
30.0°/19.0°
వాతావరణం
జిల్లాలో ఉదయం పలుచోట్ల దట్టమైన పొగ మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

తహసీల్దార్ల బదిలీలు

ఏటూరునాగారం: పార్లమెంట్ ఎన్నికలు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉండడంతో ఎన్నికల కమిషన్ సూచనల మేరకు కలెక్టర్ ఇలా త్రిపాఠి తహసీల్దార్లు, నయాబ్ తహసీల్దార్ల(డీటీ) బదిలీలను చేపడుతూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గోవిందరావుపేట తహసీల్దార్ ఎ.రాజ్ కుమార్‌ను జిల్లా కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న సమ్మయ్య మరో చోటుకు బదిలీ అయ్యారు. ఏటూరునాగారం మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న సృజన్‌కుమార్ గోవిందరావుపేటకు బదిలీ అయ్యారు. కన్నాయిగూడెంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సయ్యద్ సర్వర్ ఏటూరునాగారం తహసీల్దార్‌గా బదిలీ కాగా కలెక్టరేట్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఖాజామొహినొద్దీన్ వెంకటాపురం తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. వెంకటాపురం(కె)లో తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎస్.సమ్మయ్యను కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. రెవెన్యూ డివిజన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డి.సమ్మయ్యను ములుగు తహసీల్దార్‌గా బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వాహనాలపై రాళ్లు



ఎస్ఎస్‌తాడ్వాయి: పస్రా– తాడ్వాయి మధ్యలో జలగలంచ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి వాహనాలపై రాళ్లు విసిరారు. జలగలంచ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు జాతీయ రహదారిపై నుంచి వెళ్లే వాహనాలపై రాళ్లు విసరడంతో ఓ కారు అద్దాలు పగిలి ముందు సీట్లో కూర్చున్న వ్యక్తి కి స్వల్పగాయాలయ్యాయి. అంతేకాకుండా ఆర్టీసీ బస్సుపై రాళ్లు విసరడంతో బస్సు కిటికి అద్దం పగిలిందని ప్రయాణికులకు ఎలాంటి గాయాలు తగలేదని ఓ ప్రయాణికుడు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు వాహనాలపై రాళ్లు విసురుతున్న విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. సోషల్ మీడియాల్లో ఈవిషయం చక్కర్లు కొట్టడంతో వాహనాదారులు భయపడుతున్నారు.

జిల్లా కమిటీ రద్దు



ఏటూరునాగారం: ములుగు జిల్లా ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం జిల్లా కమిటీని రద్దు చేస్తున్నట్లు ఆ కమిటీ ప్రధాన కార్యదర్శి కావుల సమ్మయ్య తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకపోడు సంఘం బాధ్యులు సంఘాన్ని సరిగా నడిపించడం లేదన్నారు. మళ్లీ నూతనంగా కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట శ్రీను, పిట్టల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ చేతల ప్రభుత్వం

మంగపేట: కాంగ్రెస్ పార్టీ మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు చింత పరమాత్మ అన్నారు. మండల పరిధిలోని కమలాపురంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమయంలో ఆయన మాట్లాడారు. గడిచిన పదేళ్లలో ఉమ్మడి జిల్లాలోనే అతిపెద్ద భారీ పరిశ్రమ అయిన కమలాపురం బిల్ట్ పరిశ్రమను పునరుద్ధరించే విషయంలో పూర్తిగా విఫలమైందన్నారు. కేవలం రాయితీలను ప్రకటించి కల్లబొల్లి మాటల గారడీ హామీలకిచ్చిన కార్మికులను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే బిల్ట్ పరిశ్రమను పునరుద్ధరించి ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా మంత్రులు సీతక్క, కొండా సురేఖ సహకారంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. బిల్ట్ పునరుద్ధరణపై దృష్టి సారించిన సీఎం ఈ ప్రాంత అన్ని వర్గాల ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అధికారం చేపట్టిన రోజు నుంచే ఆరుగ్యారంటీ పథకాలను అమలుచేసేందుకు ముందడుగు వేసిందన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితప్రయాణం అమలు చస్తుందన్నారు. ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించి మరిన్ని పథకాలను అమలు చేసేందుకు దృఢనిశ్చయంతో ముందుకు సాగుతుందని, వంద రోజుల్లో ఆరుగ్యారంటీ పథకాలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. నిత్యం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, శ్రీధర్‌బాబు, ప్రజా సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధికోసం మంత్రులు ప్రభుత్వ యంత్రాంగంతో సమీక్షలు నిర్వహిస్తు ప్రజా పాలనకోసం బాటలు వేస్తున్నారన్నారు.

ఇక్కడైతే ఎకరాకు రూ.30వేలు ఆదానే...

ఉదహరణకు మంగపేటకు చెందిన వెంకటేశ్ పది ఎకరాల్లో జామాయిల్ సాగు చేస్తున్నాడు. దాదాపు 12 సంవత్సరాల పాటు ఉండే ఈ పంట నాలుగేళ్లకు ఒకసారి చేతికి వస్తుంది. ఆ నాలుగేళ్లలో సాగుకు రూ.16వేలు ఎకరానికి ఖర్చు అవుతుంది. అంటే 10 ఎకరాలకు రూ.1,60,000 అవుతుంది. ప్రతి నాలుగేళ్లకు ఒకసారి ఎకరానికి దాదాపు 40 టన్నుల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం ఒక్కో టన్నుకు రూ.5వేలు ఉండడంతో రూ.రెండు లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఈ పంటను సారపాక ఐటీసీకి తరలించేందుకు మధ్యవర్తులు, రవాణా చార్జీలు కలిపి రూ.30వేలపైనే అవుతోంది. అంటే పది ఎకరాలకు దాదాపు రూ.మూడు లక్షలు వీరికే వెళ్తోంది. అదే కమలాపూర్ బిల్ట్ ఫ్యాక్టరీ ప్రారంభమైతే ఆ డబ్బులు మిగలనున్నాయి.



'బిల్ట్'తో ములుగు.. వెలిగేనా!?

సరిగ్గా తొమ్మిదిన్నర ఏళ్ల తొమ్మిది నెలల క్రితం మూత

- తాజాగా సీఎం సమీక్షతో కలప గుజ్జు తయారీపై ఆశలు
- యూనిట్ మొదలైతే స్థానికులకు దండిగా ఉపాధి అవకాశాలు
- జామాయిల్ రైతులకు వచ్చే ఆదాయంలో ఎకరాకు రూ.30వేలకుపైగా ఆదా
- మంత్రిగా ఎమ్మెల్యే సీతక్క ఉండడంతో ఈ యూనిట్‌పై గంపెడాశలు
- మూతబడిన ఏప్రిల్ నాలుగో తేదీకి ముందే తెరిపించేలా ప్రణాళికలు



బిల్ట్ కర్మాగారం

సాక్షి, వరంగల్: ములుగు జిల్లాలోని మంగపేట, ఏటూరునాగారం, తాడ్వాయి, కన్నాయిగూడెం ప్రాంతాలకే కాదు ఉమ్మడి వరంగల్‌లోని జామాయిల్ రైతుల జీవితాల్లో మళ్లీ వెలుగులు రానున్నాయి. ఇప్పటికే వేలాది ఎకరాల్లో సాగుచేస్తున్న జామాయిల్ పంటలను నేరుగా కమలాపురం బిల్ట్ గ్రాఫిక్ పల్ప్ అండ్ పేపర్ లిమిటెడ్ (బీజీపీపీఎల్) ఫ్యాక్టరీకి గతంలోనే విక్రయించడం ద్వారా మంచి ఆదాయం తెచ్చుకున్న రైతులు...2014లో మూతబడిన ఆ కర్మాగారాన్ని తాజాగా తిరిగి తెరుస్తున్నారన్న వార్తల నేపథ్యంలో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడి ఎమ్మెల్యే ధనసరి అనసూయ (సీతక్క) మంత్రిగా కూడా ఉండడం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ముఖ్య అనుచరురాలు కావడంతో తప్పకుండా ఈ ఫ్యాక్టరీ ప్రారంభమై గతంలో లాగానే వేలాది మందికి ఉపాధి దారి చూపుతారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆ ఫ్యాక్టరీ మూతబడిన నాటినుంచి జామాయిల్ రైతులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకలోని ఐటీసీ ఫ్యాక్టరీకి తరలిస్తున్నా, మధ్యవర్తులు, రవాణా ఖర్చుల రూపంలో ఎకరాకు రూ.30వేలకుపైగా అదనంగా ఆదాయంనుంచి వెళ్లిపోతుందని విచారం వ్యక్తం చేస్తున్నారు. అదే ఫ్యాక్టరీ తిరిగి ప్రారంభమైతే ఆ డబ్బు మిగులుతుందని, తద్వారా ఆర్థికంగా కుటుంబాలు అభివృద్ధి చెందుతాయంటున్నారు. జామాయిల్ రైతులకే కాదు.. ఈ ఫ్యాక్టరీలో పనిచేసిన 700కుపైగా కుటుంబాలతోపాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పించినవారవుతారన్న సంతోషం అక్కడున్న వారిలో కనిపిస్తోంది.

ఏటా 90వేల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం..

జామాయిల్ చెట్లను నరికిన తర్వాత ఐదు, 10 ఫీట్లు దుంగలు చేసి కలప తీసుకొస్తారు. జామాయిల్‌తో ఉడకబెట్టి పల్ప్ (గుజ్జు) తయారు చేస్తారు. దీనినుంచి పేపర్ షీట్ (అట్ట) తయారీ అవుతుంది. ఈ ముడి సరుకులను ఇతర ప్రాంతాల్లోకి కర్మాగారాలకు పంపించి పేపర్ లేయర్లు తయారుచేసి అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్ముతారు. గతంలో ఇక్కడ తయారైన ముడి సరుకును మధ్యప్రదేశ్‌లోని గ్రాసిన్ కంపెనీకి తరలించి అక్కడ తయారుచేశారు. ఇందిరాగాంధీ ఆరుసూత్రాల పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జాయింట్ వెంచర్‌తో ఆంధ్రప్రదేశ్ రేయాన్స్ (ఏపీరేయాన్స్)గా 1977 అక్టోబర్ 11న ప్రారంభించారు. 1981 నుంచి ఫ్యాక్టరీలో రేయాన్ గ్రేడ్ పల్ప్(కలపగుజ్జు) పేపర్ గ్రేడ్ రెండు గ్రేడ్‌ల పల్ప్ ఉత్పత్తి తయారీ ప్రారంభమైంది. సంవత్సరానికి 90వేల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం గల ఫ్యాక్టరీ 1991లో తాఫర్ గ్రూప్ ప్రభుత్వంనుంచి కొనుగోలు చేసి బిల్ట్‌గా పేరు మార్చింది. ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయ్యే పల్ప్‌కు మార్కెట్ లేకపోవడంతో 2014 ఏప్రిల్ 05 సీ షిఫ్ట్ నుంచి కర్మాగారంలో యాజమాన్యం ఉత్పత్తిని నిలిపివేసింది. గ్రాసిన్ కంపెనీ ఇక్కడినుంచి కొనడం ఆపడంతో ఫ్యాక్టరీ మూతబడింది. దీంతో ఫ్యాక్టరీలో పనిచేసే 658 మంది పర్మనెంట్ కార్మికులు, 200 మంది స్టాఫ్, క్లరికల్, 534 మంది పీఎఫ్, 1200 మంది నాన్ పీఎఫ్ కార్మికులు, పరోక్షంగా మరో 10వేల మంది ఉపాధి కోల్పోయారు. మూతబడిన ఏప్రిల్ నాలుగు తేదీకి ముందే తెరిపించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారన్న వార్త ఇక్కడివారిలో ఆశలు రేకెత్తిస్తోంది.

ఇక్కడి రైతులకు ఎంతో లాభసాటి..



మూతపడిన బిల్ట్ ఫ్యాక్టరీ ప్రారంభమైతే జిల్లాలో జామాయిల్ సాగు చేస్తున్న రైతులకు లాభసాటిగా ఉంటుంది. ఫ్యాక్టరీపై ఆధారపడి 80ఎకరాల జామాయిల్ తోటను సాగు చేశా. ఫ్యాక్టరీ మూతపడక ముందు కలప స్థానికంగా విక్రయించేందుకు సౌకర్యంగా ఉండేది. ప్రస్తుతం ఎకరం తోటలోని కలపను 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాక ఐటీసీ కంపెనీకి తరలించాల్సి వస్తోంది. జామాయిల్ కలపను తరలించేందుకు రవాణా ఖర్చు, మధ్యవర్తులకు కమీషన్ చెల్లించేందుకు అదనంగా రూ.30వేల ఖర్చు అవుతుంది. బిల్ట్ ప్రారంభమైతే స్థానిక రైతులతోపాటు పొరుగున ఉన్న భూపాలపల్లి, వరంగల్ జిల్లాల రైతులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుంది.

– గాదె శ్రావణ్‌కుమార్, రైతు, నర్సింహసాగర్, మంగపేట

రోగనిర్ధారణ ఇక సులువు

ఏటూరునాగారానికి టీ హబ్ మంజూరు

- త్వరలోనే ఉన్నతాధికారులు ప్రారంభించే అవకాశం
- ఏజెన్సీవాసులకు అందనున్న మెరుగైన వైద్య సేవలు


ఏటూరునాగారంలోని డయాగ్నోస్టిక్ ల్యాబ్ భవనం

ఏటూరునాగారం: జిల్లాలోని గిరిజన ప్రాంతాల ప్రజలకు మెరుగైన రోగ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు ఏటూరునాగారానికి తెలంగాణ డయాగ్నోస్టిక్ ల్యాబ్(టీ–హబ్)ను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని నాలుగు ఐటీడీఏల పరిధిలోని ఆస్పత్రులకు సెంటర్లు మంజూరు చేయగా ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలోని సీహెచ్‌సీకి మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. గతంలో ప్రభుత్వం సూత్రప్రాయంగా ఇక్కడ తెలంగాణ టీ–హబ్‌కు కావా ల్సిన భవనాన్ని ఐటీడీఏ ద్వారా నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా రెండేళ్ల క్రితం మంజూరు చేసింది. భవన నిర్మాణం కూడా పూర్తి అయ్యింది. అందుకోసం తెలంగాణ హబ్‌కు రాష్ట్ర ప్రభుత్వం కావాల్సిన మిషనరీ, సిబ్బంది, సామగ్రికి ఎలాంటి నిధులు ఇవ్వలేదు. ఇప్పుడు ఏటూరునాగారానికి టీ–హబ్ మంజూరు కావడం వల్ల కావాల్సిన పరికరాలు, సిబ్బంది, సామగ్రి త్వరలోనే రానుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఐటీడీఏ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాలు, ప్రజలకు రోగ నిర్ధారణ పరీక్షలను నూటికి నూరుశాతం ఉచితంగా చేసేందుకు టీ హబ్ మంజూరు చేయడం అభినందనీయం.

ఐదు మండలాలకు కేంద్ర బిందువు

ఏటూరునాగారంలోని సామాజిక ఆస్పత్రికి అనుసంధానంగా ఏటూరునాగారం టీ–హబ్‌ను చేపట్టనుంది. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు ఇచ్చింది. ఇందులో ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం(కె) మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని రోగులకు ఉచితంగా రోగ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు ఈ హబ్‌కు పంపించనుంది. దానివల్ల ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ నుంచి రోగులు బయటపడినట్లు అయింది. టీ హబ్‌లో భాగంగా విల్ వర్క్స్, ఎలక్ట్రికల్స్, వాటర్, ఇంటర్నెట్, ఇతర సౌకర్యాలను అధికారులు కల్పించనున్నారు. ఈ సెంటర్ అందుబాటులోకి వస్తే ఏజెన్సీ ప్రాంత గిరిజనులు అనారోగ్యం బారిన పడిన సమయంలో రక్త నమూనాలను ఇతర ప్రాంతాలకు పంపించకుండా ఇక్కడే వ్యాధి నిర్ధారణ చేసి చికిత్స చేయడం సులువు కానుంది. ఈ నెల 12న ఉన్నతాధికారుల బృందం ఆస్పత్రిని సందర్శించి అవసరమైన పరికరాలు, ఇతర అంశాలపై పరిశీలించి నివేదిక ప్రభుత్వానికి సమర్పించనుంది. ఆ తర్వాత సెంటర్‌ను ప్రారంభిస్తారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

డీఈఓ పాణిని


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ పాణిని

ములుగు: జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని పదోతరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి జి.పాణిని అన్నారు. మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు కాసిందేవిపేట, జంగాలపల్లి పాఠశాలలను ప్రార్థనా సమయంలో డీఈఓ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలన్నారు. పదోతరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు శ్రద్ధతో ప్రత్యేక తరగతులకు హాజరై పాఠ్యాంశాలలోని సందేహాలను, సంబంధిత విషయ నిపుణులతో నివృత్తి చేసుకుని అధ్యయనం చేయాలన్నారు. ఉపాధ్యాయులందరూ విధిగా ప్రార్థన సమయానికి ఐదు నిమిషాల ముందే పాఠశాలలకు చేరుకోవాలన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల షెడ్యూల్ ప్రకారం ఉదయం, సాయంత్రం గంటపాటు ప్రత్యేక తరగతులను నిర్వహించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు.

మెరుగైన ఫలితాలు సాధించేలా..

వెంకటాపురం(ఎం): పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరూ ఎస్ఎస్‌సీ ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని పిలుపునిచ్చారు. మండల పరిధిలోని జవహర్‌నగర్ ఆదర్శ పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి ప్రత్యేక తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పరీక్షలంటే విద్యార్థులు ఆందోళన చెందవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష క్వాలిటీ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీధర్ పాల్గొన్నారు.

భావవ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి


విద్యార్థికి బహుమతిని అందజేస్తున్న మురళీధర్‌రావు

ములుగురూరల్: సమాజంలోని యువతీ యువకులు భావవ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడాలని జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ వసుధ అన్నారు. జిల్లా కేంద్రంలోని మహర్షి డిగ్రీ, పీజీ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం వరంగల్ వారి ఆధ్వర్యంలో మై భారత్ వికసిత్ భారత్ అంశంపై ఉపన్యాస పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వసుధ హాజరై మాట్లాడారు. పుట్టుకతో ఏ వ్యక్తి గొప్పవాడు కాలేడని విద్యా, సమాజం, స్వీయ అనుభవంతోనే అనేక విషయాలు అలవర్చుకొని మంచి పౌరులుగా ఎదగాలన్నారు. ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ మురళీధర్ రావు మాట్లాడుతూ పట్టుదల, నిబద్ధత, క్రమశిక్షణతో విషయంపై అవగాహన పెంచుకుని చాకచక్యంగా మాట్లాడటం అలవాటు చేసుకోవాలన్నారు. ఉపన్యాస పోటీల్లో మొదటి బహుమతిని జాకారం జూనియర్ కాలేజీ విద్యార్థి మారుతి గెలుచుకున్నారు. ఈ బహుమతిని గెలుచుకున్న వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మహర్షి విద్యాసంస్థల కరస్పాండెంట్ తుమ్మ పిచ్చిరెడ్డి, జాతీయ యువజన అవార్డు గ్రహీత ఆకులపల్లి మధు, లెక్చరర్ కొమ్ముల సురేష్‌బాబు, డా.రఫిక్, వివిధ కళాశాలలకు చెందిన యువతీ యువకులు పాల్గొన్నారు.

మేడారంలో నాణ్యత లేని కోళ్లు


మేడారంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న కోళ్లు

ఎస్ఎస్ తాడ్వాయి: మండల పరిధిలోని మేడారంలో కోళ్ల దుకాణాలు ఏర్పాటు చేసుకున్న యజమానులకు ఓ హోల్‌సేల్ వ్యాపారి నాణ్యత లేని కోళ్లను విక్రయింస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. మేడారంలో పదుల సంఖ్యలో కోళ్ల స్టాళ్లు ఏర్పాటు చేసుకున్న యజమానులకు ఇతర ప్రాంతానికి చెందిన ఓ హోల్‌సేల్ వ్యాపారి కోళ్లను సరఫరా చేస్తున్నాడు. ఈ కోళ్ల సరఫరాలో నాణ్యమైన కోళ్లను సరఫరా చేయాల్సి ఉండగా నాణ్యత లేని కోళ్లను సరఫరా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. హోల్‌సేల్ వ్యాపారి సరఫరా చేస్తున్న కోళ్లు బలహీనంగా ఉండటంతో దుకాణాల యజమానులకు తూకం తగ్గుతూ నష్టపోవాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నారు. కోళ్లలో కూడా నాలుగైదు రకాల మేలి రకం కోళ్లు ఉన్నప్పటికీ మేడారం జాతరకు వచ్చే భక్తులను ఆసరా చేసుకొని సదరు హోల్‌సేల్ వ్యాపారి ఇష్టం వచ్చిన కోళ్లను సరఫరా చేస్తున్నట్లు దుకాణాదారులు, భక్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు దుకాణాలలో క్రమం తప్పకుండా తనిఖీ చేసి కోళ్ల నాణ్యత పై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుకుంటున్నారు.

బోరు మోటారు చోరీ


బోరును దొంగలు ఎత్తుకెళ్లగా మిగిలిన పైపు

ఏటూరునాగారం: బోరు బావిలోని విద్యుత్ మోటారును గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి ఎత్తుకెళ్లారు. బాధిత రైతు సాయిని శ్రీనివాస్ కథనం ప్రకారం... మండల పరిధిలోని ముళ్లకట్ట శివారు వరి పొలంలో బోరు బావిలోని 5హెచ్‌పీ విద్యుత్ మోటారు ఉంది. రోజూ మాదిరిగానే పొలం వద్దకు వెళ్లి చూసే సరికి బోరు పైపులు కట్ చేసి ఉంది. బోరు మోటారును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. రూ. 50 విలువ చేసే మోటారును దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపారు.

అధికారులు అంకితభావంతో పనిచేయాలి

అదనపు కలెక్టర్ శ్రీజ


విద్యార్థులు భోజనం చేస్తుండగా పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

వాజేడు: అధికారులు విధుల్లో అలసత్వం వహించకుండా అంకితభావంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. మండల పరిధిలోని జంగాలపల్లిలో గల కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె హాజరు పట్టిక, వంట గది, స్టోర్ రూములను పరిశీలించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నత పాఠశాలకు వెళ్లి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం నాగారంలోని ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తుండగా భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సమయంలో వంట కార్మికులు తమ మధ్యాహ్న భోజన బిల్లులపై అడగగా త్వరలోనే బిల్లులు వస్తాయని తెలియజేశారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పీహెచ్‌సీని తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది హాజరు పట్టికతో పాటు రికార్డులు, స్టోర్ రూంతో పాటు ఆశ వర్కర్ల డ్యూటీ చార్ట్‌ను పరిశీలించారు. వైద్యాధికారి మధూకర్‌తో మాట్లాడుతూ వైద్య సేవలు, ప్రసవాల గురించి అడిగి తెలుసుకున్నారు. మదర్ అండ్ చైల్డ్ హెల్త్ కార్డు ఎలా ఉపయోగించాలి అనే విషయంపై ఆశ కార్యకర్తలకు సూచనలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో ఆన్‌లైన్ చేస్తున్న ప్రజాపాలన దరఖాస్తుల విధానాన్ని పరిశీలించారు. సకాలంలో ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.


కేజీబీవీలో రికార్డులను పరిశీలిస్తున్న శ్రీజ

ఏఎన్‌ఎంకు షోకాజ్ నోటీస్

జంగాలపల్లిలోని కస్తూర్బా గాంధీ పాఠశాల ఏఎన్‌ఎంకు అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశాల మేరకు డీఈఓ షోకాజ్ నోటీస్ ఇచ్చారు. పాఠశాలను ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఏఎస్‌ఎంగా విధులు నిర్వహించే ఉద్యోగి ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించడంలో నిర్లక్ష్యం వహించిన కారణంగా షోకాజ్ నోటీస్ ఇవ్వాలని అధికారులను ఆదేశించగా డీఈఓ జారీ చేశారు. అదే పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలు వ్యక్తి గత కారణాలతో విధులను నిర్వహించలేనని రాజీనామా పత్రాన్ని డీఈఓకు అందించగా ఆమోదించారు.

రూ. 70లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం

- నిబంధనలు పాటించని కాంట్రాక్టర్
- ప్రయాణికులకు తప్పని తిప్పలు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండల పరిధిలోని మేడారంలో ఆర్అండ్‌బీశాఖ ఆధ్వర్యంలో రూ.70 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం పనులు సాగుతున్నాయి. మేడారం ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఊరట్టం స్తూపం వరకు కిలోమీటర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులను గుత్తేదారు చేపట్టారు. మేడారం జాతర సందర్భంగా భక్తుల వాహనాల రాకపోకల కోసం దెబ్బతిన్న ప్రదేశంలో పాత తారును తొలగించి మళ్లీ బీటీ వేసేందుకు పనులు చేస్తున్నారు. ఈ నెలఖారు కల్లా కిలోమీటర్ బీటీ నిర్మాణం పనులు పూర్తి చేస్తామని ఆర్అండ్‌బీ డీఈ రఘువీర్ తెలిపారు.

నిబంధనలు నిల్

బీటీ రోడ్డు నిర్మాణం పనుల్లో నిబంధనలు పాటించడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. పాత రోడ్డును తొలగించి దానిపై కంకర పోస్తున్నారు. కంకరను రోలర్‌తో రోలింగ్ చేసి నీళ్లు చల్లకపోవడంతో దుమ్ము లేస్తుంది. కారులు, జీపులు, భారీ వాహనాలు రోడ్డుపై నుంచి వెళ్లే క్రమంలో ద్విచక్ర వాహనదారుల కళ్లలో దుమ్ము పడి కిందపడి గాయాలపాలవుతున్నారు. అంతేకాకుండా అక్కడక్కడా పాత రోడ్డుపై తారును తొలగించి కంకర పోయకుండా వదిలేస్తున్న పరిస్థితులు ఉన్నాయి. ఈ నెల 5న మేడారంలో జాతర పనులను పరిశీలించిన మంత్రి సీతక్క రోడ్ల నిర్మాణం పనులను నాణ్యతగా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అయినా మేడారం బీటీ రోడ్డు నిర్మాణం పనుల్లో సంబంధిత గుత్తేదారు నిబంధనలు పాటించకుండా పనులు చేస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. రోడ్డు పనులు నిబంధనల మేరకు జరిగేలా అధికారులు ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రయాణికులు, భక్తులు కోరుతున్నారు.


కంకరను రోలింగ్ చేయకుండా వదిలేసిన కాంట్రాక్టర్


రోడ్డు తవ్వి వదిలేసిన కాంట్రాక్టర్

క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


వెంకన్న (ఫైల్)

గార్ల: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని పుల్లూరులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చాపల వెంకన్న (38) గతేడాది తనకున్న ఎకరంతో పాటు మరో ఎకరం భూమిని కౌలుకు తీసుకుని మిర్చి పంట సాగు చేశాడు. పంట నష్టం రావడంతో అప్పులపాలయ్యాడు. వ్యవసాయం కోసం సుమారు రూ.6 లక్షలు అప్పు అయింది. దీంతో అప్పు ఎలా తీర్చాలనే తరచూ మనోవేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లాడు. రాత్రి వరకూ ఇంటికి రాకపోవడంతో భార్య సుజాత కుటుంబ సభ్యులతో కలిసి పొలం వద్ద వెతికినా వెంకన్న కనిపించలేదు. ఉదయం అదే గ్రామానికి చెందిన ఓ రైతు తన వ్యవసాయ బావి మోటార్ ఆన్ చేయగా వెంకన్న బావిలో శవమై కనిపించాడు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహం బయటకు తీశారు. కాగా, వ్యవసాయ బావి పక్కన మద్యం బాటిల్, పురుగు మందు డబ్బా లభించడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడు బీటెక్ చదివాడు. ఉద్యోగం రాకపోవడంతో తనకున్న భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు సంతానం. ఈ ఘటనపై భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరారెడ్డి తెలిపారు.

పోలీసుల వాహన తనిఖీలు

- నల్లబెల్లం, పటిక, ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


స్వాధీనం చేసుకున్న వాహనాలను చూపుతున్న పోలీసులు

దంతాలపల్లి: మండలకేంద్రంలో మంగళవారం 30 క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కేజీల పటిక, రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. గ్రామ శివారులో నిర్వహించిన వాహన తనిఖీల్లో ఏపీ 07 ఈడీ 5941 నంబర్‌గల వాహనంలో తరలిస్తున్న 30 క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కేజీల పటిక స్వాధీనం చేసుకుని ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన డ్రైవర్ విట్టు భానుప్రసాద్, నర్సింహులపేట మండలం కొమ్ములవంచ గ్రామం దుబ్బతండా చెందిన జాటోత్ హచ్చా, సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం రావులపల్లికి చెందిన గుగులోత్ సంతోష్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. కాగా, లారీ డ్రైవర్ భాను ప్రసాద్ పరారయ్యారని ఎస్సై పేర్కొన్నారు. అలాగే, నర్సింహులపేట మండలంలోని ఆకేరు వాగు నుంచి అనుమతి లేకుండా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి డ్రైవర్లు జాటోత్ శ్రీనివాస్, ఆరుసూర్ల రాములుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటయ్య, మధు,రాజు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో ‘విజిలెన్స్’ కలకలం

మేడిగడ్డ బ్యారేజీ, పంపుహౌస్‌ల్లో తనిఖీలు
- ప్రభుత్వ ఆదేశాలతో విచారణకు కదలిన యంత్రాంగం
- ఆయా బ్యారేజీలు, పంపుహౌస్‌ల్లో కీలక పత్రాలు స్వాధీనం?


కన్నెపల్లిలోని లక్ష్మీపంపుహౌస్ వద్ద లోపలికి వెళ్తున్న విజిలెన్స్ అధికారులు

కాళేశ్వరం : బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై విజిలెన్స్ దాడులు కలకలం సృష్టిస్తున్నాయి. ప్రాజెక్టు పరిధిలోని బ్యారేజీలు, పంపుహౌస్‌ల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఏకకాలంలో మెరుపుదాడులు చేస్తున్నారు. 10 ప్రత్యేక బృందాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఇంజనీరింగ్ శాఖ నిపుణలతో పాటు పోలీసు విభాగాలకు చెందిన అధికారులు తనిఖీల్లో పాల్గొన్నారు. మంగళవారం జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ (లక్ష్మీ)బ్యారేజీ, మహదేవపూర్ డివిజన్ ఇరిగేషన్ కార్యాలయం, కన్నెపల్లిలోని మేడిగడ్డ(లక్ష్మీ)పంపుహౌస్‌ల్లో ఏకకాలంలో విజిలెన్స్ అధికారుల బృందం తనిఖీలు చేపట్టింది. ఇంజనీరింగ్ అధికారులతో బ్యారేజీ, పంపుహౌస్‌ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కీలకపత్రాలు, రికార్డులు, కంప్యూటర్‌లో పొందుపరిచిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రాత్రి వరకూ తనిఖీలు కొనసాగుతున్నాయి. దీంతో దాడులు రాష్ట్ర వ్యాప్తంగా చర్చానీయాంశంగా మారాయి.

మొదటి నుంచి..

2022 జూలై14న భారీ వర్షాలతో లక్ష్మీపంపుహౌస్ ప్రహరీ కూలి ఆరు బాహుబలి మోటార్లు మునిగి మరమ్మతుకు గురైన విషయం విధితమే. కంట్రోల్ రూమ్‌తో పాటు పలు విలువైన సామగ్రి ధ్వంసమైంది. ఇప్పటి వరకు ఆరు మోటార్లు తీసుకురాలేదు. స్వయాన పంపుహౌస్‌ను అప్పటి ఇరిగేషన్ శాఖ సలహాదారు పెంటారెడ్డి గోదావరి దగ్గరలో కాకుండా పై భాగంలో నిర్మిస్తే మునిగి ఉండేది కాదని, సాంగేతికపరంగా తప్పు జరిగిందని తెలిపిన విషయం తెలిసిందే. ఆ సమయంలోనే గ్రావిటీ కాల్వ పలు చోట్ల కోతకు గురైంది. అప్పుడు అవినీతికి పాల్పడ్డారని, నాణ్యతతకు తిలోదకాలు ఇచ్చారని పలు సందర్భాల్లో విపక్షాలు ఆరోపణలు చేశాయి.

ఈఏడాది..

గత అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీలో 7వ బ్లాక్ లోని 19, 20, 21 పియర్‌లు కుంగిన విషయం తెలిసిందే. వారంలోపే అన్నారం బ్యారేజీలో సీపేజీ బుంగలు ఏర్పడ్డాయి. ఆ బ్యారేజీ కూడా ప్రమాదంలో ఉందని ప్రత్యేక నిపుణులు చెబుతున్నారు. మేడిగడ్డ బ్యారేజీ సంబంధిత ఇరిగేషన్ అధికారులు, ఎల్‌అండ్‌టీ మేనేజర్ సురేష్ ఆధ్వర్యంలో పియర్‌లు కుంగిన మరుసటి రోజున పూర్తి బాధ్యత తమదేనని విలేకరులతో తెలిపారు. మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తరువాత డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాల కంటే ముందే ఎల్‌అండ్‌టీ సంస్థ తమ బాధ్యత కాదని ఇరిగేషన్ అధికారులకు లేఖల ద్వారా తెలియజేసింది. దీంతో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. ఎల్‌అండ్‌టీ, ఇంజనీరింగ్ ఉన్నతాధికారులపై ఒత్తిడి చేయడంతో దిగొచ్చారు. డిసెంబర్ 29న మేడిగడ్డ వద్ద మంత్రులు శ్రీధర్‌బాబు, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్, వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేక్‌కు ఈఎన్‌సీ మురళీధర్‌రావు నేతృత్వంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో సుమారు ఐదు గంటల పాటు పూర్తి వివరాలు వెల్లడించారు. మంత్రులు అడిగిన ప్రశ్నలను కొంత మేర నివృత్తి చేశారు. మూడు పియర్‌లు, మూడు క్రస్ట్ గేట్లు తొలగించి కొత్త నిర్మాణం చేట్టాలని నిర్ణయించారు. అంతకు ముందు కాళేశ్వరంపై కేంద్ర డ్యాం సేఫ్టీ అధికారులు బృందం బ్యారేజీ పియర్‌లను తొలగించాల్సిందే అని నివేదికలు కేంద్రానికి అందజేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం బ్యారేజీ వద్ద కాఫర్‌డ్యాం పనులు జరుగుతున్నాయి.

విచారణతో వేగం..

కాళేశ్వరం ప్రాజెక్టు బాధ్యులపై జ్యుడిషియల్ విచారణ చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో సీఎం రేవంత్, నీటిపారుదశాల మంత్రులు వేగం పెంచినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కాళేశ్వరం లింక్–1 నుంచి రాష్ట్రస్థాయిలో 12 ప్రాంతాల్లో విజిలెన్స్ అధికారులు ఆయా బ్యారేజీలు, పంపుహౌస్‌ల వద్ద విచారణ చేపట్టడంతో ఇంజనీరింగ్ అధికారులు నివ్వెరపోతున్నట్లు తెలిసింది. అధికారుల బృందం కొన్ని కీలపత్రాలు, రికార్డులు స్వాధీనం చేసుకుని హైదరబాద్‌కు తరలిస్తున్నట్లు తెలిసింది. కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లు, ఇతర రికార్డులను తీసుకెళ్తున్నట్లు సమాచారం. విచారణను అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. బ్యారేజీ, పంపుహౌస్‌ల వద్దకు ఎవరినీ అనుమతించడం లేదు. స్థానిక ఇంజనీరింగ్ అధికారులు సెల్‌ఫోన్ స్విచాఫ్ చేసి ఉంచారు. పోలీసు పహారాలో ఆయా ప్రాంతాలు ఉన్నాయి. అర్ధరాత్రి వరకు విజిలెన్స్ విచారణ చేయనున్నారని తెలిసింది.

ఐలోని మల్లన్న క్షేత్రానికి రావాలి


సీఎం రేవంత్‌రెడ్డికి మల్లన్న చిత్రపటాన్ని బహూకరించి జాతరకు ఆహ్వానిస్తున్న మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఈఓ నాగేశ్వర్‌రావు, ఉప ప్రధాన అర్చకుడు రవీందర్

- సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించిన దేవాదాయ శాఖ మంత్రి సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు

ఐనవోలు: శతాబ్దాల చరిత్ర కలిగిన ఐనవోలు శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో సంక్రాంతి నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాల(జాతర)కు రావాలని సీఎం రేవంత్‌రెడ్డిని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆహ్వానించారు. మంగళవారం ఉదయం మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాగరాజును ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు జాతరకు ఆహ్వానించారు. అనంతరం మంత్రి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ఈఓ, ఆలయ అర్చక సిబ్బంది హైదరాబాద్‌లోని సచివాలయానికి వెళ్లి సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 13 నుంచి ఉగాది వరకు ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు సీఎంకు వివరించారు. గొల్ల కేతమ్మ, బలిజ మేడలమ్మలతో కూడిన శ్రీమల్లికార్జునస్వామి చిత్రపటంతో పాటు జాతర ఆహ్వాన పత్రికను రేవంత్‌రెడ్డికి అందజేశారు. వేదపండితులు గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి.. సీఎం రేవంత్‌కు వేదాశీర్వచనం చేయగా ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్.. స్వామి వారి శేషవస్త్రాలతో సన్మానించారు. మంత్రి, ఎమ్మెల్యేతో కలిసి ఆలయ ఈఓ.. సీఎం రేవంత్ రెడ్డికి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రలో భాగంగా గత సంవత్సరం ఫిబ్రవరి 16న శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రత్యేక పూజలు చేసినట్లు సీఎం రేవంత్ రెడ్డికి ఆలయ ఈఓ గుర్తుచేశారు. ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకోవాలని కోరారు. స్పందించిన సీఎం ఆలయానికి తప్పకుండా వస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది శేఖర్‌రావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పింగిళి వెంకట్‌రెడ్డి, కుందూరు వెంకట్‌రెడ్డి, అబిడి రాజిరెడ్డి, గొట్టిముక్కల రమాకాంత్ రెడ్డి, ఆలయ సీనియర్ అసిస్టెంట్ కిరణ్, అర్చకుడు నరేష్ శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

సర్కారు భూమి కబ్జా.. ప్రజాభవన్‌లో ఫిర్యాదు

- స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి


ప్రజాభవన్‌లో ఫిర్యాదు చేస్తున్న భూపరిరక్షణ కమిటీ సభ్యులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం ఎల్లాపురంలో సర్కారు భూముల కబ్జాపై భూపరిరక్షణ కమిటీ.. జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. ఏడాది కాలంగా పలుమార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో చివరికి భూపరిరక్షణ కమిటీ సభ్యులు మంగళవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో ఫిర్యాదు చేశారు. కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎల్లాపురంలో సర్వే నంబర్ 246/1లో సుమారు రెండున్నర ఎకరాల భూమిని హసన్‌పర్తికి చెందిన ఓ దాత చేపల ఉత్పత్తి కేంద్రానికి దానం చేశారు. ఇందులో భవనంతో పాటు బావి నిర్మాణం చేపట్టారు. 1973లో అప్పటి కేంద్ర మంత్రి సుబ్రహ్మణ్యం ఈ చేపల ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఆ భూమి అన్యాక్రాంతానికి గురైందని ఆ ఫిర్యాదులో వివరించారు. చేపల ఉత్పత్తి కేంద్రం కోసం నిర్మించిన భవనంతో పాటు ఇతర నిర్మాణాలు నేలమట్టం చేశారని వివరించారు. ఇదే గ్రామ శివారులోని సర్వే నంబర్ 316లో అంగడీకి దానం చేసిన సుమారు ఐదెకరాల భూమికి పట్టాపాస్‌పుస్తకాలు జారీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ స్థలం పశువైద్యశాల నిర్మించారని చెప్పారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు. కబ్జాపై విచారణ జరిపి సర్కారు స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని భూపరిరణ కమిటీ అధ్యక్షుడు రేనుకుంట్ల దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి వెలిశోజు బుచ్చిరాజు, ఆర్గనైజర్ ఎర్ర నాగరాజు కోరారు.

రెయిలింగ్‌ను ఢీకొన్న ద్విచక్రవాహనం

- వృద్ధుడు అక్కడికక్కడే మృతి
- మల్లంపల్లి శివారులో ఘటన

ములుగు రూరల్ : ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం రెయిలింగ్‌ను ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందిన సంఘటన జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం బోల్లోనిపల్లి గ్రామానికి చెందిన బోళ్ల సారంగపాణి (65), ఉమ దంపతులు. పక్షవాతం వచ్చిన ఉమకు ఆయన అన్నీ తానై చూసుకుంటున్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఉమను కుమార్తె తన ఇంటికి తీసుకెళ్లింది. ఇంటిలో ఒంటరిగా ఉన్న సారంగపాణి మంగళవారం రాత్రి ద్విచక్రవాహనంపై భోజనం చేసేందుకు వెళ్తున్నాడు. మల్లంపల్లి శివారులోని రెయిలింగ్‌ను ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో సారంగపాణి అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన ప్రయాణికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సమాచారం తెలుసుకున్న ములుగు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

కూల్‌డ్రింక్ అనుకుని.. గడ్డిమందు తాగిన బాలుడు

- ఆసుపత్రిలో ప్రాణాలతో పోరాటం
- చికిత్సకు సాయం చేయాలని తల్లిదండ్రుల వేడుకోలు
- బయ్యారం మండలం కస్తూరినగర్‌లో ఘటన


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సాయిచరణ్

బయ్యారం: కూల్‌డ్రింక్ అని భావించి ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగిన ఓ బాలుడు.. ప్రాణాలతో ఆసుపత్రిలో పోరాడుతున్నాడు. ఈ ఘటన మండలంలోని కస్తూరినగర్‌లో జరిగింది. ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బాదావత్ శ్రీను తన మిరప తోటకు పిచికారీ చేసేందుకు ఈ నెల 4వ తేదీన గడ్డి మందు కొనుగోలు చేసి ఇంట్లో నిల్వ చేశారు. ఈ విషయం తెలియని తన కుమారుడు సాయిచరణ్ కూల్‌డ్రింక్‌గా భావించి అదే రోజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాగాడు. ఆ తరువాత ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు తమ కుమారుడు గడ్డిమందు తాగిన విషయం గమనించి చికిత్స నిమిత్తం మహబూబాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండ డంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. గడ్డి మందు తాగడంతో సాయిచరణ్‌కు కిడ్నీ, లివర్ దెబ్బతిన్నట్లు వైద్యులు పరీక్షల ద్వారా గుర్తించారు. ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్న సాయిచరణ్‌కు రూ. 2 లక్షల మేర అప్పు చేసి వైద్యం చేయించారు. ఇంకా వైద్యం అవసరం ఉండటంతో తల్లిదండ్రులు దాతల సాయం కోరుతున్నారు.

తమ కుమారుడి వైద్యం కోసం 632396844, 9908769721 నంబర్లకు ఫోన్ పే ద్వారా సాయం చేసి ప్రాణభిక్ష పెట్టాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

రివ్యూలకు డబ్బులంటూ..

రూ.70 వేలు కాజేసిన సైబర్ నేరగాళ్లు
- లబోదిబోమన్న యువకుడు.. పోలీసులకు ఫిర్యాదు
- రఘునాథపల్లి మండలంలో ఘటన

రఘునాథపల్లి: గూగుల్ రివ్యూకు రూ. 50 ఇస్తామని ఆశ చూపి ఓ యువకుడి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.70 వేలు కాజేశారు. రోజుకు రూ. 5 వేల వరకు సంపాదిచొచ్చని చెప్పి.. మొదట రివ్యూకు డబ్బులు పంపిన కేటుగాళ్లు అనంతరం ఆ యువకుడి నుంచి భారీ మొత్తం తమ ఖాతాలో జమ చేయించుకుని మోసగించారు. ఈ ఘటన రఘునాథపల్లి మండలం ఆంధ్రతండా గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ధారావత్ అనిల్ ఫోన్‌కు గత నెల 11వ తేదీన +24495673987 నంబర్ నుంచి వాట్సాప్ మెసేజ్ వచ్చింది. ఇందులో గూగుల్ రివ్యూస్ ఇస్తే ఒక్కో రివ్యూకు రూ .50 చొప్పున ఇస్తామని, రోజూ రూ.5 వేల వరకు సంపాదించొచ్చని ఉంది. దీనికి యువకుడు స్పందించడంతో ‘టెగాఆమ్’ యాప్ డౌన్‌లోడ్ చేసుకోమని సూచించిన సైబర్ నేరగాళ్లు కొన్ని లింక్‌లు పంపి రివ్యూలు ఇవ్వమని సూచించారు. మూడు దశల్లో రూ. వెయ్యి చెల్లించి అనిల్ రివ్యూలు పంపాడు. అనంతరం యువకుడి బ్యాంకు ఖాతాకు రూ. 5 వేలు పంపారు. దీంతో వారిని నమ్మిన అనిల్ తరువాత కూడా కొంత మొత్తం చెల్లించి రివ్యూలు పంపాడు. తన ఖాతాతో పాటు స్నేహితుల బ్యాంక్ అకౌంట్ నుంచి పలు దఫాలుగా రూ.70 వేల వరకు పంపాడు. దీనికి ప్రతిగా రూ. 92 వేలు వస్తాయని ఆశ చూపారు. ఎంతకూ డబ్బులు ఖాతాకు పంపకపోగా.. మరో రూ 1.50 లక్షలు తాము సూచించిన అకౌంట్‌లో జమ చేయాలని సైబర్ నేరగాళ్లు చెప్పారు. దీంతో మోసపోయానని గ్రహించిన అనిల్ మంగళవారం రఘునాథపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చాగర్ల రఘుపతి తెలిపారు.

స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకం

- కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్



మాట్లాడుతున్న కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్

హన్మకొండ: మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరీ నిర్మూలనలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమని కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్ అన్నారు. మంగళవారం ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్, ఎఫ్.ఎం. ఎం. సాంఘిక సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరీ నిర్మూలనపై హనుమకొండ సుబేదారిలోని అసంత భవన్‌లో హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాలోని స్వచ్ఛంద సంస్థలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా తీరని కలంకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, వెట్టిచాకిరీ వల్ల దోపిడీ, లైంగిక వేధింపులు, తదితర ఘటనలు చాలా జరుగుతున్నాయన్నారు. దీని నిర్మూలనకు ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా పనిచేయాలన్నారు. మద్రాస్ హైకోర్టు న్యాయవాది రాజ్ కుమార్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ రవాణా, వెట్టిచాకిరీ నిర్మూలన కోసం చట్టాలు రూపొందించినట్లు తెలిపారు. మనిషి జీవించే హక్కు, స్వేచ్ఛ హక్కు, పనిచేసే హక్కు కలిగి ఉన్నాడన్నారు. ఈ హక్కులకు ఎవరైనా భంగం కలిగించేలా ప్రవర్తిస్తే శిక్షార్హులన్నారు. స్వచ్ఛంద సంస్థలు సామాజిక కోణంలో స్పందించి పని చేస్తే హక్కులు కాపాడబడి వారు స్వేచ్ఛగా జీవించే అవకాశం కలుగుతుందన్నారు. బెంగుళూర్‌కు చెందిన ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ మిషన్ ప్రతినిధి డాక్టర్ జోబి మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలతో అనేక సంవత్సరాలుగా వెట్టిచాకిరీ, మానవ అక్రమ రవాణా నిర్మూలన కోసం తమ సంస్థ పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో హనుమకొండ, మహబూబాబాద్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్‌లు అనిల్ చందర్ రావు, నాగవాణి, హనుమకొండ డీసీపీఓ సంతోష్, ఏ.హెచ్.టి.యు. ఇన్‌స్పెక్టర్ వెంకట్రామ్, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ రెజీనా చిన్నప్ప, ప్రాజెక్ట్ మేనేజర్ ఎర్ర శ్రీకాంత్, ప్రోగ్రాం అధికారి బత్తుల కరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి మృతి

వేర్వేరు కారణాలతో మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ముగ్గురు మృతి చెందారు. భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లిలో గుండెపోటుతో కానిస్టేబుల్, వర్ధన్నపేటలో చికిత్స పొందుతూ వ్యక్తి, ఖమ్మంలో జరిగిన షార్ట్‌సర్క్యూట్ ఘటనలో బయ్యారానికి చెందిన యువకుడు మృతి చెందాడు.

ఎల్కతుర్తి: గుండెపోటుతో ఓ కానిస్టేబుల్ మృతి చెందాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లిలో జరిగింది. వంగర ఎస్సై వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. రంగయ్యపల్లికి చెందిన గోంగళ్ల యుగేంధర్(36) టీఎస్‌ఎస్పీ 8వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం స్వగ్రామం వచ్చాడు. అదే రాత్రి ఛాతిలో నొప్పి వస్తుందని తండ్రితో చెప్పాడు. మంగళవారం తెల్లవారుజామున తండ్రి మల్లయ్య.. యుగేంధర్‌ను లేపగా చడిచప్పుడు చేయలేదు. దీంతో ఇరుగుపొరుగు వారిని పిలిచారు. వారు వచ్చి చూడగా యుగేంధర్ అప్పటికే మృతి చెందాడు. మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

వర్ధన్నపేట: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం వర్ధన్నపేట పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన ఓర్సు రాంచంద్రు(65)కు ఇద్దరు భార్యలు ఉన్నారు. కాగా, 9 నెలల క్రితం చిన్న భార్యపై హత్యాయత్నం చేశాడనే కారణంతో జైలుకు వెళ్లాడు. అనంతరం బెయిల్‌పై విడుదలయ్యాడు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం పట్టణంలోని తన చిన్న భార్యవద్దకు వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించి భార్య కుటుంబ సభ్యులు హుటాహుటిన వరంగల్ ఎంజీఎంకు తరలించినట్లు తెలిసింది. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు తెలిసింది.


రాంచంద్రు(ఫైల్)

విద్యుదాఘాతంతో యువకుడు..

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని ధంసలాపురం వద్ద కేబుల్ టీ వీ లైన్ మరమ్మతు చేస్తుండగా విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి చెందాడు. మానుకోట జిల్లా బయ్యారానికి చెందిన అనిల్ కుమా ర్(28) కేబుల్ టీవీలో పనిచేస్తున్నాడు. సోమవారం లైన్ మరమ్మతు చేసే క్రమంలో విద్యుత్ స్తంభంపై వైర్‌ను సరిచేస్తుండగా షాక్ తగలడంతో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న అనిల్ సోమవారం అర్ధరాత్రి మృతిచెందగా, బంధువుల ఫిర్యాదు మేరకు మంగళవారం ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

బీసీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్‌సీఓ మనోహర్‌రెడ్డి

విద్యారణ్యపురి : ఉమ్మడి వరంగల్ జిల్లాలో మహాత్మాజ్యోతిబాపూలే తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024–2025 విద్యాసంవత్సరంలో 6,7,8 తరగతుల్లో ఖాళీ సీట్లలో ప్రవేశాల కోసం బీసీ, ఎస్సీ ,ఎస్టీ ,ఈబీసీలలో అర్హులైన విద్యార్థిని, విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆ బీసీ గురుకులాల ఉమ్మడి వరంగల్ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ మనోహర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 6వతరగతిలో ఖాళీసీట్లకు 2023–2024 సంవత్సరంలో 5వతరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు, 7వతరగతిలో ప్రవేశాలకు అదే సంవత్సరం లో 6వ తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు, 8వతరగతిలో ఖాళీ సీట్లకు 7వతరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు అర్హులన్నారు.

దరఖాస్తు విధానం..

అర్హులైన విద్యార్థిని, విద్యార్థులు రూ.100 రుసుం చెల్లించి ఎంజేపీ టీబీఈడబ్లూ ఆర్ఐఈఎస్ .తెలంగాణ .గౌట్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.6,7,8 తరగతులలో ప్రవేశాలకు ప్రవేశపరీక్ష ఈ ఏడాది మార్చి 3వ తేదీన నిర్వహిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 040–23328266 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

5వ తరగతిలో ప్రవేశపరీక్షకు దరఖాస్తుల గడువు పొడిగింపు

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ టీఎస్‌డబ్లూ ఆర్ ఈఐఎస్,టీటీడబ్లూఆర్‌ఈఐఎస్, ఎంజేపీ బీసీడబ్లూఆర్‌ఈఐఎస్, టీఆర్‌ఈఐఎస్‌గురుకుల పాఠశాలల్లో ఈవిద్యాసంవత్సరం 2024–2025లో ప్రవేశాలకుగాను దరఖాస్తులు చేసుకునేందుకు గడువును ఈనెల 20వతేదీ వరకు పొడిగించారని సంబంధిత అధికారులు తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. దరఖాస్తులు చేసుకున్న వారికి ఈఏడాది ఫిబ్రవరి 11న ప్రవేశపరీక్ష ఉంటుందని ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ మనోహర్‌రెడ్డి తెలిపారు.

ఇసుక లారీలపై పోలీసుల నజర్

- అధిక లోడ్‌తో వెళ్తున్న వాహనాలు సీజ్
- మంత్రి ఆదేశాల మేరకు చర్యలు

మంగపేట: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి నిత్యం వందల సంఖ్యలో వరంగల్, హైదరాబాద్, తదితర ప్రాంతాలకు ఇసుక రవాణా చేస్తున్న లారీలపై మంగపేట పోలీసులు నజర్ పెట్టారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం సాంబాయిగూడెం, పినపాక మండలం వీరాపురం గోదావరి ఇసుక క్వారీల నుంచి నిత్యం వందల సంఖ్యలో నిబంధనలకు విరుద్ధంగా మండలం మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో జిల్లా సరిహద్దు గ్రామం మొదలు.. ఏటూరునాగారం వరకు 34 కిలో మీటర్ల మేర రోడ్డు ధ్వంసమైంది. ఫలితంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పాటు మేడారం మహాజాతర నేపథ్యంలో ఇసుక లారీలతో భక్తులకు ప్రమాదం జరిగే అవకాశం ఉండడంతో వీటిని నిలిపి వేసే చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క అధికారులకు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో జిల్లా వ్యాప్తంగా అప్రమత్తమైన పోలీసులు లారీలను నిలిపివేసే చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి ఎస్సై గోదరి రవికుమార్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కమలాపురంలో సామర్థ్యానికి మించి లోడ్‌తో వెళ్తున్న 4 లారీలను సీజ్‌చేశారు. రెండు రోజులు క్రితం మరో మూడు లారీలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. మంత్రి ఆదేశాల మేరకు పోలీసులు ఇసుక లారీలను నియంత్రించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది.


కమలాపురంలో పోలీసులు పట్టుకున్న ఇసుక లారీలు